సీపీఐలో పలువురు చేరిక

నవతెలంగాణ-చేర్యాల



పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సీపీఐ పార్టీ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం కొముం వెల్లి, మద్దూరు మండలాలకు చెందిన పలువురు సీపీఐలో చేరగా వారికి అశోక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో పుల్లూరి మంజుల, తుప్పతి రాజు, తుప్పతి చిన్న రాజు, రమేష్, కృష్ణ, బాల రాజు, అనిల్ ఉన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, డివిజన్ నాయకుడు జంగిలి యాదగిరి, మండల కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్ రెడ్డి, అందె బాబు, జింకల బాలమల్లు పాల్గొన్నారు.

విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-నంగునూరు



సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో శనివారం మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, బాషాయి గూడెంలోని పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజి మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్ల దయతో అందరం చల్లగా ఉండాలని, మనం చేసే ప్రతి కార్యంలో మంచి జరగాలని కోరుకున్నారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు హరీష్ రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఆలయ నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్ని మాపక సేవల అధ్వర్యంలో జిల్లాలో అగ్ని మాపక వారోత్సవాలను ఏప్రిల్ 14-20 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం సహాయ జిల్లా అగ్ని మాపక అధికారి సురేష్ కుమార్ చేతుల మీదుగా వారోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి సురేష్ కుమార్ మాట్లాడుతూ 'అగ్నిభద్రతను నిర్ధారించండి దేశాభివృద్ధికి సహకరించండి'. అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన నివారణ చర్యలు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. అవగాహన లోపం నిర్లక్ష్యంతోనే అధిక ప్రవదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వేసవి కాలంలో అగ్ని ప్రవదాలు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని అగ్నిమాపక అధికారులకు సిబ్బందికి సూచించారు. అలాగే అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కుమార్, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



నీలం మధు గెలుపు కోసం పాటుపడతాం

నవతెలంగాణ-సిద్దిపేట

మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ఎస్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తామని రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో నీలం మధు గెలుపు కోసం ఎస్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుందన్నారు. ప్రతి ఎస్ఎస్‌యుఐ కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యారా రఘుపతి, రాకేష్, సాజిద్, వరుణ్, లోకేష్, రఘు, రియాజ్, ఆనంద్ పాల్గొన్నారు.



గజ్వేల్ నుండి భద్రాచలం బయల్దేరిన గోటి తలంబ్రాలు

నవతెలంగాణ-గజ్వేల్

శ్రీరామనవమి నాడు భద్రాచలంలో కన్నుల పండుగగ జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి గజ్వేల్ నుండి శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు గోటి తలంబ్రాలను లక్షల మంది భక్తులచే పూర్తి చేయించి శనివారం అద్దాల మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భద్రాచల దేవస్థానానికి బయల్దేరారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ 150 కిలోల గోటి తలంబ్రాలకు శ్రీకారం చుట్టి లక్ష మంది భక్తులే లక్ష్యంగా ప్రతి భక్తునిలో రామభక్తిని మేల్కొలిపి గోటి తలంబ్రాలలో పాలు పంచుకునేలా చేశామన్నారు. సోమవారం భద్రాచల దేవస్థాన అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.



చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-చేర్యాల

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సత్యం ల్యాండ్రీ షాపు వద్ద శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపు యజమాని రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడేండ్లుగా చేర్యాల పట్టణంతోపాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పకాయల సంతోష్ కుమార్, గుడాల ప్రభాకర్, భూమి గారి రమేష్, శ్రీనివాస్, రాఘవులు, ఫారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సఫాయి కార్మికుడు మృతి



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని శేరుపల్లి బంగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సేవకుడిగా ఎర్రోళ్ల ప్రశాంత్ (29) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్.వి.యం ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడికి భార్య రేణుక, పిల్లలు అద్య, ఆకాంక్ష ఉన్నారు.

ప్రజాస్వామిక గొంతుకపై నిర్బంధాలు

- ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్న ప్రభుత్వాలు
- సమాజాన్ని చైతన్యపరుస్తున్న ప్రభీర్ పుర్కాయస్త రచనలు
- అలుపెరుగని పోరాటం పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-మెదక్

ప్రజాస్వామిక గొంతుకపై ప్రభుత్వాలు నిర్బంధాలు కొనసాగిస్తున్నాయని సీనియర్ సిటిజన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొండల్ రెడ్డి, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం, టియూడబ్ల్యూజె (ఐజెయూ) జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగరాజు పేర్కొన్నారు.





శనివారం సాయంత్రం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ప్రబీర్ పుర్కాయస్త రచించిన అలుపెరగని పోరాటం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలను ప్రశ్నించే పత్రికలను, విలేకరులను పాలకులు దుర్మార్గంగా అణచివేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామిక గొంతుకపైనా, ప్రజల తరుపున ఉద్యమాలు చేసే నాయకులు, మేధావులపైనా నిర్బంధం కొనసాగుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రబీర్ పుర్కాయస్త రచించిన పుస్తకాన్ని విస్తృతంగా అధ్యయనం చేయాలని కోరారు. ప్రబీర్ పుర్కాయస్త వృత్తిరీత్యా సాంకేతిక నిపుణుడని, ప్రవృత్తిరీత్యా రాజకీయవేత్త అని అందుచేతనే సైన్సును, రాజకీయాలను అనుసంధించగలిగాడని తెలిపారు. ప్రజా సేవకు అంకితమై పనిచేసిన వ్యక్తుల్లో ప్రబీర్ ఒకరని తెలిపారు. ప్రబీర్ పుర్కాయస్థ జీవితం విభిన్నమైన పద్దతుల్లో కొనసాగిందని, ఇంజనీరింగ్ చదివి సైన్స్ ఉద్యమం చేసి జర్నలిస్టుగా ఉద్యోగం చేశాడన్నారు. ప్రభుత్వాలు నియమించిన అనేక నిపుణుల కమిటీల్లో ప్రముఖ ఇంజనీరు, సామాజిక శాస్త్రవేత్త, జర్నలిస్టు ప్రబీర్ పుర్కాయస్త దేశానికి సేవలందించారని కొనియాడారు. ప్రింట్ మీడియాకు ఒకప్పుడున్నంత ప్రాధాన్యత ఇప్పుడు లేదని గుర్తించి, 'న్యూస్ క్లిక్' పేరుతో ఒక ఆన్లైన్ వార్తాసంస్థను స్థాపించాడన్నారు. దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పరిరక్షణకు దోహదపడటంతో పాటు, ప్రధానంగా ప్రజా ఉద్యమాలను కవర్ చేయాలన్న లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమాన్ని, వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభాలను ప్రజల దృష్టికి తేవడం కోసం న్యూస్‌క్లిక్, ఆన్‌లైన్ పత్రికలో వార్తలను ప్రచురించారని తెలిపారు. దీన్ని సహించలేని కేంద్ర ప్రభుత్వం ఆయనపైన, న్యూస్ క్లిక్ పత్రికపైనా గత మూడున్నర సంవత్సరాలుగా అనేక రూపాల్లో వేధింపులకు గురిచేస్తోందన్నారు. విదేశాల నుంచి నిధులు వచ్చాయని అక్రమ ఆరోపణలతో 2022లో ఆయన పత్రికను స్తంభింపజేసిందని తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరిపి ప్రభుత్వం చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవంటూ తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కక్షతో 2023 అక్టోబర్ 3న అరెస్ట్ చేసి తీహారు జైల్లో పెట్టిందన్నారు. ఇప్పటి వరకు పుర్కాయస్తపై చేసిన ఏ ఆరోపణకు నిర్దిష్ట సాక్ష్యాలు లేకపోయినప్పటికీ ఆయనను విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోపాల్ గ్యాస్ లీకేజి దుర్ఘటన సమయంలో లీకేజీ కారణాలను వెలికితీసి బాధితుల తరపున పోరాటం చేసిన నిపుణులలో ప్రబీర్ ఒకరని తెలిపారు. భారతదేశంలో సైన్సు ప్రచారం చేసి, ప్రజల్లో శాస్త్ర విజ్ఞానం పెంపొందించడానికి మొదలైన దేశవ్యాపిత సైన్సు ఉద్యమంలో ప్రబీర్ ఒక ముఖ్యుడని తెలిపారు. ఒక సాధారణ, మధ్య తరగతి బెంగాలీ కుటుంబంలో జన్మించిన ప్రబీర్ పుర్కాయస్థ తన జీవితం ఎన్నెన్ని మలుపులు తిరిగింది, రాజకీయంగా ఎలా పరిణతి చెందింది ఈ 'అలుపెరుగని పోరాటం' అనే తన జ్ఞాపకాల్లో ఎంతో ఆకట్టుకునే రీతిలో వివరించడన్నారు. దీనికి ప్రబీర్ ఒక విశిష్టమైన శైలిని ఎంచుకున్నాడన్నారు. వర్తమానం నుంచి మొదలు పెట్టి గతంలోకి వెళతాడని, మళ్లీ గతం నుంచి వర్తమానంలోకి వచ్చేస్తాడని తెలిపారు. ఈ పుస్తకంలో ప్రబీర్ నాటి ఎమర్జెన్సీని, నేటి అప్రకటిత ఎమర్జెన్సీని పోల్చి చెప్పినట్లు తెలిపారు. కొన్ని విషయాల్లో నాటి ఎమర్జెన్సీ కన్నా నేటి ఎమర్జెన్సీయే మరింత దుర్మార్గమైనదని వివరించినట్లు తెలిపారు. ఆనాటి పత్రికా సెన్సార్ షిప్ మాదిరి కాకుండా, నేడు మోడీ ప్రభుత్వం మీడియాను భయపెట్టి స్వయం నియంత్రణను పాటించేలా చేస్తున్న వైనాన్ని వివరించారని తెలిపారు.



ఆర్ ఎస్ ఎస్ అజమాయిషీలో కొనసాగుతున్న బిజెపి నాయకత్వంలోని మోడీ నిరంకుశ ప్రభుత్వం అనుసరించే ఫాసిస్టు తరహా చర్యలతో భారత గణతంత్ర వ్యవస్థ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పెనుప్రమాదంలో పడిపోయిన నేటి పరిస్థితిలో ప్రబీర్ పుర్కాయస్త జ్ఞాపకాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదివి మరింత అప్రమత్తం కావలసిన పుస్తకమన్నారు. ఇంగ్లీషులో లెఫ్ట్ వర్డ్ వారు 'కీపింగప్ ది గుడ్ ఫైట్' పేరుతో ప్రచురించిన ఈ పుస్తకాన్ని తెలుగులో తీసుకురావడానికి అనుమతించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడి. ఆనందం, రామస్వామి, జర్నలిస్ట్ నాయకులు సురేందర్ రెడ్డి, మల్లేశం, బస్వరాజు, నర్సమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో మనుగడకు ముప్పు

- సీపీఐ(ఎం)మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్
- ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గుగ్గిల్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ వల్ల మానవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని రానున్న తరాల భవిష్యత్తు దృష్ట్యా పరిశ్రమల నిర్మాణాలను ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. గుగ్గిల్ల, పోతారం గ్రామాల్లోని ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా పరిశ్రమల యాజమాన్యాలు కొందరు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులను మభ్యపెట్టి దొంగచాటుగా అభ్యంతరం లేదని అనుమతులు పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమ భవిష్యత్తు కోసం ఆరాటపడుతూ పరిశ్రమల వల్ల కలిగే అనర్థాల దృష్టితో నిర్మాణాలపై అయా గ్రామాల ప్రజలు నిరసనలు చేపడుతూ పోరాటాలు చేస్తుంటే పోలీస్ యంత్రాంగం పరిశ్రమల యాజమాన్యాల పక్షాన నిలబడడం ప్రజల పోరాటాలను అణచివేయడమేనన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, పోలీస్ యంత్రాంగం యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరించకుండా ప్రజల పక్షాన నిలబడాలని లేని పక్షంలో ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని చేస్తున్న పోరాటంలో ప్రజలతో పాటు సీపీఐఎం పాలుపంచుకుని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయిక్రిష్ణ, సంగ ఎల్లయ్య, బోనగిరి దుర్గయ్య పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు అందని డబ్బులు

నవతెలంగాణ-గజ్వేల్

ఎండలో చేతులకు పొక్కులు వస్తున్నా పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు నెలలు గడుస్తున్న వేతనాలు ఇవ్వడం లేదని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. శనివారం గజ్వేల్ మండలం బిజీగామ, చిన్న ఆరపల్లి వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పని నడుస్తున్న వద్దకు అధికారులు వెళ్లి పరిశీలన చేయాలని కనీసం తాగేందుకు నీరు లేదన్నారు. ఉపాధి కూలీలకు చేతులకు పొక్కులు వచ్చాయని ఆయన అన్నారు. నెలలు గడుస్తున్న వేతనాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిచేసే చోట తాగునీరు వైద్య సిబ్బంది ఉండవలసిన అవసరం ఉందన్నారు.



మెదక్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం

నవతెలంగాణ-మర్కుక్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి, అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షులు టి.రమేశ్ గుప్త అన్నారు. శనివారం ఆయన మర్కుక్ లో మాట్లాడుతూ బీజేపీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని మోడీకి కానుకగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశ రక్షణ ప్రజా సంక్షేమం బీజేపీ వల్లే సాధ్యపడుతుందన్నారు. పేదలకు గత మూడు సంవత్సరాలుగా అన్నపూర్ణ పథకం ద్వారా బియ్యం, ఉజ్వల ద్వారా గ్యాస్, రైతులకు కిసాన్ సామ్మాన్ యోజన ద్వారా పెట్టుబడి మహిళలకు సామాజిక భద్రత, 33 శాతం రిజర్వేషన్, ఆర్థికంగా వెను కబడిన ఓసి వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు వంటి అనేక పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు.

ఎంత అందితే అంతే..

- అనుమతుల్లేకుండా అడ్డగోలుగా మట్టి రవాణా
- ఇల్లంతకుంట నుండి మండల కేంద్రానికి సరఫరా

నవతెలంగాణ-బెజ్జంకి

ఎంత అందితే అంత దోచుకోవడం అన్నట్టుంది. చెరువు శిఖం మట్టిని నిబంధనలకు విరద్ధంగా అడ్డగోలుగా రెయింబవళ్లు అక్రమంగా తరలించుకుంటూ రైతుల వ్యవసాయ సాగు భూముల్లో నిల్వ చేస్తున్నారు మట్టి దొంగలు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ముస్కానిపేట గ్రామ శివారులోని చెరువు నుండి భారీ వాహనాల ద్వార తరలిస్తూ మండల కేంద్రం శివారులో ఓ రైతు వ్యవసాయ సాగు భూమిలో భారీగా మట్టి నిల్వ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న మట్టి రవాణపై అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టిని తరలిస్తున్న భారీ వాహనాలతో భయాందోళనకు గురవుతున్నామని కల్లెపల్లి గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతార్ చేస్తూ కనీసం అధికారులకు సమాచారం లేకుండా మట్టి దొంగలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ అక్రమంగా ఏర్పాటుచేసిన మట్టి నిల్వలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కల్లెపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



ఎర్ర నెలలో నల్ల మట్టి నిల్వ..?

మండల కేంద్రం శివారులోని కల్లెపల్లి వేళ్లే మార్గంలో రోడ్డు ప్రక్కన ఓ రైతు వ్యవసాయ సాగు చేసే ఎర్ర నేలలో భారీగా నల్ల మట్టి నిల్వ చేయడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భారీగా మట్టి నిల్వ చేసిన ప్రాంతానికి కనుచూపు మేరలో ఇటుక బట్టి ఉండడం విశేషం. అధికారులు విధుల్లో లేని సమయం, జన సంచారం లేని సమయాన్ని అదునుగా చేసుకుని పథకం ప్రకారమే ఇటుక బట్టికి తరలించడానికి భారీగా మట్టిని నిల్వ చేశారని పలువురు వాపోతున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని సలక్‌పూర్ గ్రామ శివారులో పేకాట స్థావరాలపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మద్దూరు పోలీసులు కలిసి తనిఖీ చేయడంతో రూ.70 వేల నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలాక్ పూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో. సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి దాడులు చేయడంతో. కాసు ఇన్నారెడ్డి, వీరుపాక మహేందర్‌రెడ్డి, ఇన్నం దినేష్, ఇరువ రంజిత్ రెడ్డి, మామిడి గోపికృష్ణ, దేవి భూపాల్, లు పేకాట ఆడుతూ దొరికినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుండి రూ.70 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో కానీ ఇండ్లలో గాని పేకాట ఆడితే ఎవరైనా సమాచారం అందించాలని ఆయన కోరారు. జూదం పేకాట ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు



తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక,పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేస్తే వారిపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు, మద్దూరు పోలీసులు పాల్గొన్నారు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

నవతెలంగాణ-గజ్వేల్

విద్యా రంగా సమస్యలపై నిరంతరంగా పోరాటం సాగిస్తామని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ వలి అహ్మద్ అన్నారు. శనివారం టీఎస్ యుటిఎఫ్ 11వ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా గజ్వేల్ కేంద్రంలో డివిజన్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ముందుండి పోరాటం చేస్తున్నమని ఎన్నో విజయాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. ఐక్య ఉద్యమాలకు నాంది పలికింది ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ల ఐక్య ఏర్పాటులో కీలక పాత్ర పోషించినట్లు ఆయన గుర్తు చేశారు. పీఆర్సీ సాధన కోసం ఉద్యమం చేసిందని, మెరుగైన వేతనం పేస్కేల్ కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. పండిట్, పీఈటీ పోస్టుల అప్రిడేషన్ కొరకు ఉపాధ్యాయులకు పదోన్నతులు పాఠశాలలో ఖాళీలను భర్తీ కోసం పోరాటం చేశావన్నారు. పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయడానికి పోరాటం సాగిస్తున్నామన్నారు. జీవో 317 అమల్లో జరిగిన లోటుపాట్లను సరి చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం అర్షించదగ్గ పరిణామమన్నారు. బదిలీ అయిన ఉపాధ్యా



యులను చివరి పరిధినం రోజున విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన అన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట కిరణ్, ఎస్ సుధాకర్, వివిధ మండలాల బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ పాషా, సంక్రియ, కృష్ణ, వెంకటేశం, రామచంద్ర, సునీల్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-కల్హేర్

బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సిర్గాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరా ల ప్రకారం.. మండలంలోని తాండా కు చెందిన విస్లావత్ సురేష్(30) శుక్రవారం సాయంత్రం సిర్గాపూర్ గ్రామానికి వెళ్లి కూరగాయలు, కిరణ సామాగ్రి తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా.. బైక్ అతివేగంగా ఉండడంతో సిర్గాపూర్ గ్రామ శివారులోని బీటీ రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు వేసిన మట్టిని ఢీకొట్టాడు. దాంతో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువత సామాజిక సేవకోసం కదలాలి



నవతెలంగాణ-జిన్నారం

యువత సామాజిక సేవ కోసం కదలాలని రాళ్లకత్వ పాఠశాల హెచ్ఎం లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలోని స్థానిక పాఠశాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఆమె యువకులను అభినందిం చారు. ఈ సందర్భంగా యువకులు హెచ్ఎం లక్ష్మిని శాలువాలతో సన్మానించారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థమై అదనంగా ఒక వాలంటీర్‌ను హెచ్ఎం లక్ష్మి ఏర్పాటు చేయడంతో స్థానిక యువకులు సాయి గౌడ్, గణేష్, బయన్న, సతీష్ వాలంటీర్‌కు వేతనం చెల్లించేందుకు సాయం అందించడంతో వారిని శాలువాలతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్ర మంలో బి సతీష్, ఆర్ మహేష్,అర్జున్, రఘుపతి, మహేష్,పోచయ్య, శ్రీకాంత్, శేఖర్, శ్రీను, శ్రీకాంత్ గౌడ్ , ఎస్ కె అమీర్, సిహెచ్ బాలకృష్ణ, జే ప్రకాష్, సిహెచ్ మహేష్, ఆర్ సాయి, నవీన్, శివ, నిఖిల్ బృందం పాల్గొన్నారు.

భీమ్రావును అభినందించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని నల్తూరుకు చెందిన బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా ప్రెసిడెంట్ నాయికోటి భీమ్రావును పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభినందిం చారు. శనివారం తన జన్మదినోత్స వాన్ని పురస్కరిం చుకొని ఎమ్మెల్యే ను కలిసిన నేపథ్యంలో భీమ్రావును ఎమ్మెల్యే ఆశీర్వదించి అభినందించారు.

దేశాభివృద్ధి కోసం బి.బి పాటిల్‌ను గెలిపించండి



నవతెలంగాణ-న్యాల్‌కల్

భారతదేశ అభివృద్ధి కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు సైనికుల్లాగా పనిచేసి జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బి.బి పాటిల్‌ను గెలిపించాలని పార్టీ నాయకులు, అడ్వకేట్ పాండురంగ రెడ్డి శివాజీ పాటిల్ అన్నారు. న్యాల్‌కల్ గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు ఓంకార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అభ్యర్థి బి.బి పాటిల్ మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందన్నారు. కాబట్టి ఈ ఎన్నికల్లో కమలం గుర్తుకే ఓటేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని మామిడ్గి, మల్గి, టేకూరు, మరియంపూర్‌కు చెందిన పలువురు బి.బి పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ప్రబారి, సిద్దాపురం అరుణ్, శివాజీ పాటిల్, రాజోల పాండురంగారావు పాటిల్, మల్లేష్ పాటిల్, శరణయ స్వామి, ఏక్‌నాథ, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు తదితరులున్నారు.

రక్తదాన శిబిరం అభినందనీయం



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

మహనీయుల జయంతుల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ విద్యా చరణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మేధావి భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహనీయుల జయంతుల సందర్భంగా నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో సామాజిక ఉద్యమ, సేవ, బ్లడ్ డొనర్స్, కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ ప్రారం భించారు. రక్తదానం చేసిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుడి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలే మహనీయులకు మనమిచ్చే ఘనమైన నివాళ్లన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షులు బి.కాన్షిరాం, అర్జున్ మహిళా సంఘాల ముఖ్య నాయకులు విణ కుమారి, సత్యమ్మ, శశికళ, నాయకులు అనంద్, చిరంజీవి, అశోక్, సామాజిక సంఘాల నాయకులు, సంజీవులు, టి.రాజ్ కుమార్, తూకరం, మోహన్, దేవదాస్, పుండరికం, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా సైన్ సెంటర్ పక్కన బైపాస్ రోడ్డు సంగారెడ్డిలో టీఎస్‌యూటీఎఫ్ జెండా ఆవిష్కరించి అనంత రం బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరిలు మాట్లాడుతూ.. ఈ పదేండ్ల కాలంలో టీఎస్‌యూటీఎఫ్ విద్యారంగ, ఉపాధ్యాయ సమ స్యల పరిష్కారంలో ముందున్నదన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ని రద్దు చేయాలని నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న 4 డీఏ లు వెంటనే చెల్లించా లన్నారు. నిలిచిపోయిన ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయా లని, ఉపాధ్యాయ నియామకలు వెంటనే చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరిచి అన్ని పాఠశా లన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కే.అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు జే. కాశీనాథ్, జిల్లా కార్యదర్శి బి. సాయితేజ, వి. అనురాధ, సిహెచ్ కృష్ణంరాజు, ఆర్.సింహాచలం, నాయకులు విజయానంద్, జగన్మోహన్, జ్యోతి లింగం, వై.సైమన్, వెంకయ్య, బాలకృష్ణ, సాయన్న, రామచంద్రయ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లారం మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కొత్వాల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 వందల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ హరికృష్ణారెడ్డి, కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.



ఆత్మ రక్షణ విద్యలోనూ బాలికలు రాణించాలి

నవతెలంగాణ-వట్‌పల్లి

సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి బాలికలు కూడా ఆత్మ రక్షణ విద్య మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని మోడల్ ప్రిన్సిపాల్ మల్లిక అన్నారు. మండల పరిధిలోని పోతుల బొగుడ ఆదర్శ పాఠశాలలో పీఎం పథకంలో భాగంగా విద్యార్థినులకు మూడు నెలలుగా మార్షల్స్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లిక మాట్లాడుతూ.. వారియర్ మార్షల్స్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో వందమంది విద్యార్థినులకు బెల్స్ ఎగ్జామినేషన్ నిర్వహించినట్టు చెప్పారు. బెల్స్ ఎగ్జామినేషన్‌లో మోడల్ పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొనగా 75 మంది విద్యార్థినులు ప్రతిభను కనబరిచారన్నారు. ప్రతిభను చాటిన 75 మంది విద్యా ర్థులకు బ్లాక్ బెల్ట్ తో పాటు గుర్తింపు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల సిబ్బంది విజయలక్ష్మి, పీఈటీ అరుణ, సాద్దేక, కృష్ణ, అనిల్, గౌస్, రాములు, మాస్టర్లు మురళి, నవీన్, సుప్రియ, భాను ప్రియ, మాధవి, లావణ్య, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వైతాళికుడు.. ప్రపంచ దార్శనికుడు అంబేద్కర్

- దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన గొప్ప ఆర్థికవేత్త
- కానీ నేడు రాజ్యాంగ హక్కులకు తూట్లు..!
- అంబేద్కర్ కల్పించిన 40 కార్మిక చట్టాలు నిర్వీర్యం
- రాజ్యాంగ అమలే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

నవతెలంగాణ-ఝరాసంగం

నేటి ఆధునిక సమాజంలో అమలులో ఉన్న రాజకీయ, ఉద్యోగ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార,సైనిక,ఆర్థిక,విద్య, మహిళా రంగాల వ్యవస్థలు, వాటి చట్టాలు అంబేద్కర్ ఆలోచనలతోనే రూపొంది ఉన్నాయి అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రజాస్వామిక విలువలతో వీటిని ఆయన ప్రభావితం చేశారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది పోరాడి ప్రాణాలు అర్పించవచ్చు కానీ అంబేద్కర్ ఆలోచన ఆ విధంగా వేయలేదు. అడుగడుగునా ఎన్నో అవమానాలు భరిస్తూ ఈ దేశ కోట్లాది ప్రజలందరినీ వివక్ష నుంచి అసమానత్వం నుంచి విముక్తి చేసి సమానత్వం వైపు నడపాలని పరితపించాడు. ప్రతీ మనిషికి స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం సమాన అవకాశాలను ఆత్మగౌరవాన్ని ఆయన అందించాడు. కుల నిర్మూలన ద్వారా మాత్రమే వ్యక్తి సమాజంలో దేశ అభివృద్ధి సాధ్యమవుతాయని అందుకు ఆచరణాత్మకంగా ఆయన కృషి చేశారు. భారత పరిపాలన వ్యవస్థను అధునీకరించడం ఆధునిక చట్టాలను ప్రవేశపెట్టడం దేశ సామాజిక వనరులను జాతీయం చేయడం అధికార వ్యవస్థను వికేంద్రీకరించడం వెనుకబడిన కులాలను ఉత్పత్తిలో భాగం చేయడం ద్వారా ఆధునిక భారతాన్ని శరవేగంగా ప్రపంచ పటంలో అభివృద్ధి వైపు నిలపగలిగాడు. ప్రతీ ఆధునిక రాజ్యానికి దాని రాజకీయ ప్రక్రియ విధానాన్ని నియమ నిబంధనలను సముదాయ రూపంలో సూచించుటకు ఒక అత్యున్నత చట్టం(సుప్రీం లా) అవసరం దానిని మనం రాజ్యాంగంగా పరిగణిస్తున్నాం. ప్రపంచ దార్శనికుల్లో, తత్వవేత్తల్లో అంబేద్కర్ లాంటి నాయకత్వ లక్షణాలు కలిగిన వారు మరొకరు లేరు అని ఐక్యరాజ్యసమితి గుర్తించి ప్రపంచ మేధావిగా ఆయనను గుర్తించింది. దానినే మనం ప్రపంచ నాలెడ్జ్ దినోత్సవం గా జరుపుకుంటున్నామని అంటే ఆయన చేసిన సేవలు,రచనలు వర్ణించరానివి.

కార్మిక, కూలీల శ్రేయస్సు కోసం..

అంబేద్కర్ భూస్వాముల నుంచి చిన్న కులాలకు రక్షణ కల్పించాల్సిందిగా శాసనసభల్లో ప్రవేశపెట్టిన ఖోటి వ్యవస్థ రద్దు బిల్లును ప్రజల్లో ప్రచారం చేసేందుకు మహారాష్ట్ర, కర్ణాటకలో వేలాది కిలోమీటర్లు ప్రయాణించి, ఉపన్యాసించి ప్రజల్లో చైతన్య జ్వాలను వెలిగించాడు. 1938లో కార్మికుల సంక్షేమంపై ప్రవేశపెట్టిన ఈ బిల్లు అమలు కోసం ముంబయి నగరంలోని కార్మిక సంఘాలన్నీ ఒకరోజు సమ్మె చేయా లని నిర్ణయించి సమ్మె చేపట్టారు. ఆ తర్వాత ఈ సమ్మె రెండో రోజు కొనసాగి వందలాది మంది కార్మికుల అరెస్టులతో ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందింది. 1939 వ సంవత్సరంలో బ్రిటిష్ ఇండియా వైస్రాయ్ లార్డ్ లిన్లిత్ గో, జిన్నాగాంధీలతో సమావేశమయ్యాక త్వరలో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తామని, భారత రాజ్యాంగాన్ని తిరిగి రచించాల్సి ఉంటుందని, అందులో అంబేద్కర్ కూడా పాల్గొంటారని ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో నెహ్రూ సైతం అంబేద్కర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఆ తర్వాత నిమ్న జాతులు కోరుతున్న రాజకీయ అంశాలను తీర్మాన రూపంలో వైస్రాయికి పంపారు అంబేద్కర్. రాజ్యాంగంలోని 43వ అధికరణం కార్మికుల జీవనానికి సరిపోయే వేతనాన్ని ఇతర ఉద్యోగ భద్రతలెన్నో కార్మికులకు కల్పించింది. అంతేకాదు కార్మిక సంక్షేమం కోసం రాజ్యాంగంలో 14, 23(1), 39, 41, 42, 43,43 (ఏ) ప్రకరణలను చేర్చారు. అంబేద్కర్ కార్మికుల కోసం తన జీవితకాలంలో 40 కి పైగా చట్టాలను చేశారు. కార్మిక చట్టాల్లో సమన్వయం గురించి అంబేద్కర్ ఎన్నో సందర్భాలలో ఉపన్యాసించారు. కార్మికులు మంచి వేతనాన్ని భద్రతను కోరుకుంటారని, వాటిని ప్రభుత్వాలు వారికి అందించాలని పదేపదే ప్రభుత్వాలకు గుర్తు చేసేవారు. భారతీయ కార్మిక వర్గ విధాన రూపకర్తగా ఆయన తీసుకున్న నిర్ణయాలను అంతర్జాతీయ కార్మిక సంఘం సైతం ఆయన్ను ఘనంగా ప్రశంసించడం అంటే కార్మికుల కృషికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. ఉద్య మించి పోరాడి సాధించి తెచ్చుకున్న 40 కార్మిక చట్టాలను నేటి కేంద్ర ప్రభుత్వం వాటిని నాలుగు కోడ్లుగా క్రోడీకరించి కేవలం కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా చట్టా ల ను సవరించడం హేయమైన చర్యగా నేటి కార్మికులు భావిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు కార్మికులు పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.

అంబేద్కర్ అప్రారమేథో శక్తికి, ఆర్థిక విశ్లేషణకు ప్రతిఫలంగా 1935 ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడడం, భారతీయ ఆర్థిక విధాన పటిష్టతకు ఇది ఒక గొప్ప నాందిగా సమాజం గుర్తించాలి. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడిదారుల చేతికి కట్టబెట్టేందుకు ఆర్థిక సంస్కరణ చేయడం మనం చూస్తున్నాం. అందుకు నిదర్శనమే మొన్నటికి మొన్న కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎలక్ట్రోల్ బాండ్స్. ఇది చట్ట విరుద్ధమని దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్రంపై మొట్టికాయలు వేసిన సంగతి అందరికి తెలిసిందే. రాజ్యాంగం ప్రకారం ఏ వ్యవస్థకు కూడా రాజ్యాం గానికి మించిన ఔన్నత్యం. ఔన్నత్యం,ఆధిపత్యం అనేవి కేవలం రాజ్యాంగానికి మాత్రమే ఉంటుంది. ఈ విషయాన్ని విస్మరించి వ్యవస్థలు తమ అధికార పరిధిని విస్తరించుకుంటున్నాయి. ఈ విషయంపై ఆయన ఒక చర్చలో సంబోధిస్తూ... కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయ వ్యవస్థకు స్వతంత్రత అవసరమే.. కానీ స్వతంత్రత పేరుతో ఒక సామ్రాజ్యంలో మరో సామ్రాజ్యాన్ని సృష్టించకూడదు. అని అంటారయన.

రాజ్యాంగ హక్కులకు తూట్లు..

రాజ్యాంగంలోని హక్కులను నేటి పాలకులు తూట్లు పొడుస్తు సంవత్సరాల రాజ్యాంగ అమలులో పాలకులు తమ స్వభావాన్ని మార్చుకోకుండా పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులు స్వేచ్ఛ వనరుల సంపద వంటి తదితర అనేక అంశాలకు అవరోధాలు కలిగిస్తూ రాజ్యాంగం ఏవైతే కల్పించిన హక్కులు ఉన్నాయో వాటిని కలరాస్తూ రాజ్యాంగ పూర్తికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఆర్థిక సామాజిక జీవన ప్రమాణాలు పెంపొందించడానికి రాజ్యాంగంలో 36-51 వరకు ఉన్న నిబంధనలో ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని రాజ్యాంగం ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రస్తుత సమాజంలో సంపద కార్పొరేట్ వర్గాల వారి చెంతన పేరుకు పోతుంది. మెజారిటీ ప్రజలైన బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు రూపుదిద్దబడాయి. కానీ నేటి ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని సవరించకుండనే పరోక్షంగా ప్రభుత్వ సంస్థలను పూర్తిగా విచ్ఛిన్నం చేస్తూ ప్రైవేటు పరం చేస్తున్న తీరును మనం గమనిస్తున్నాం. దేశ సంపద వారికి చేరకుండా నేడు కేవలం దేశ జనాభాలో మూడు శాతం ఉన్న ప్రజల వద్దకే పోగు కావడం దేనికి సంకేతం?. ప్రజల హక్కులను కాలరాస్తూ వారికి ఎలాంటి ఫలాలు అందకుండా రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చడానికి నేటి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతుంది. కాబట్టి ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలి. ఇలాంటి ప్రభుత్వాలను గద్దదింపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'తమ జాతికి సేవ చేసే చైతన్యాన్ని పెంచుకోవాల్సిందిగా విద్యార్థులకు, యువతకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. రాబోయే కాలంలో జాతి సంక్షేమాన్ని చూడాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉంది అని' ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం అధ్యయనం నుంచి పోరాటం, పోరాటం నుంచి అధ్యయనం వైపు అంబేద్కర్ జీవితం కొనసాగింది. ఆయన మరణంతో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆయన స్వప్నాన్ని సహకారం చేసేందుకు ఆయన చూపిన దారిలో ఆలోచిస్తూ నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళిగా సమాజం గుర్తెరగాలి.



ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి ఎనలేని కృషి..

దేశ సంపద ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయాలని అంబేద్కర్ ఆర్థిక సూత్రాల ప్రధాన లక్ష్యం. రాజకీయవేత్తగా తాను నమ్మిన ఆచరించిన అందరికీ స్వేచ్ఛ, సమా నత్వం, సౌభ్రాతృత్వం అన్న సూత్రాల ఆధారంగా ఆయన ఆర్థిక ప్రణాళిక రచించారు. ఆదాయం, కరెన్సీ, భూ సమస్య లు, వ్యవసాయం, పరిశ్రమలు వంటి ఎన్నో విషయాలపై అంబే ద్కర్ చేసిన సూచనలు, విధానాలు మన దేశానికే కాదు ప్రపం చానికే అనుసరణీయంగా ఉన్నాయడంలో ఎలాంటి సంయమనం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమించడానికి ఆయన జీవిత కాలంలో ఎంతో శ్రమించి, పరిశోధించి రూపొ ందించిన ఆర్థిక పరిశోధన పత్రాలు ఎంతో ఉపయోగపడ్డాయి. మానవ సంక్షే మం దృష్ట్యా ఆర్థిక శాస్త్రాన్ని తీర్చిదిద్ది దేశానికి వర్తింప జేయడం ఆర్థిక వేత్తగా ఆయన గొప్పతనంగా భావించాలి. దేశం ఎదుర్కొం టున్న ఆర్థిక సమస్యలపై ఫిల్టర్ యంగ్ కమిషన్కు అంబేద్కర్ ఇచ్చిన నివేదిక నేటికీ అత్యంత ప్రధానమైనది. 'కులం కేవలం శ్రమ విభజన కాదు.. శ్రామి కుల విభజన' అన్న ఆయన మాటల్లో మొత్తం ఆర్థిక శాస్త్ర సూత్రాలు ఇమిడి ఉన్నాయి. దేశంలో కులం ఒక అదనపు పెట్టుబడిగా అద నపు సంపదగా అధికార కేంద్రంగా ఉన్న అంశాలని పరిశోధించి కను గొన్న కులాన్ని అర్థశాస్త్రంలో భాగంగా అధ్యయనం చేసి ప్రభు త్వ ప్రణాళిక రూపొందించారు. ప్రజల సంక్షేమాన్ని సామాజిక అభివృద్ధిని అంబేద్కర్ ఆర్థిక శాస్త్రం క్షణక్షణం ప్రతిబింబిస్తుంది.

మాజీ ఎమ్మెల్యేకు మల్లికార్జున స్వామి కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని తనసొంత గ్రామమైన ఖానాపూర్ గ్రామంలో సోమవారం జరగనున్న శ్రీ మల్లికార్జున స్వామి మేడలమ్మ, కేతమ్మల కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డికి ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను యాదవ సోదరులు అందజేశారు. కురుమ సంఘం నాయకులు గ్రామ ఉప సర్పంచ్ ప్రభు,నాయకులు బీరప్ప, రాజు, సాయిలు, పండరి తదితరులు పాల్గొన్నారు.



గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..

సిర్గాపూర్ మండలంలోని గోసాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయ గౌడ్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు సంజీవరావు పాటిల్, యువ నాయకులు ప్రశాంత్ సాగర్, మహేందర్ గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-సంగారెడ్డి

మహనీయుల యాదిలో.. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా శనివారం 'రక్తదాన శిబిరం' ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజ్, రక్తనిధి వైద్యులు వెంకట్‌రామ్ ఉదయ్, సిబ్బంది రాజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్, జయరాజు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి హాని జరగదని.. చైతన్యవంతులై ప్రతి ఒక్కరు రక్తదానం చేసి రోగుల ప్రాణాలను కాపాడాలని కోరారు. రోజు రోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని.. పసిపిల్లలు తలసేమియా వ్యాధితో ఇబ్బంది పడుతున్నారన్నారు. గర్భిణులకు రక్తం అత్యంత అవసరమన్నారు. కేవీపీఎస్ కులవివక్ష అంటరానితనానికి వ్యతిరేకంగా, రాజ్యాంగం రిజర్వేషన్ల రక్షణ కోసం, దళితుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూనే.. మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పూలే ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు 'అంబేద్కర్ కొందరి వాడు కాదు - అందరి వాడు' అని అన్నారు. సమాజంలో జరుగుతున్న పీడనకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాలు నిర్వహిస్తున్నదని.. పోరాటాలే కాదు సామాజిక సేవా కార్యక్రమంలో కేవీపీఎస్ ముందుంటున్నదన్నారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని.. ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాదాన్ని ముందుకు తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నారని.. మనువాదుల కుట్రలు సాగనివ్వబోమన్నారు. సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన వారందరిని అభినందించారు.. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశం, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి అధ్య క్షులు రమేష్, బాబురావు, కేవీపీఎస్ నాయకులు మహేష్, గంగారాం మహేష్ మోజెస్, నరేష్, మోహన్, సుదర్శన్, గౌస్, శివ, దినేష్, అనిల్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి

నవతెలంగాణ-జిన్నారం

సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన వంగవీటి రాజిరెడ్డి శనివారం నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి.. రాజిరెడ్డికి అందించి అభినందించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను మరింత పటిష్టవంతంగా నెరవేరుస్తానని, ఈ నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో పాటు పలువురు నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, జిన్నారం మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి, గుమ్మడిదల మండలాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు 'ప్రత్యేక డ్రైవ్'



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు సీఐ రవి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించి.. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనదారులు ప్రయాణ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్‌కు సంబంధించిన డాకుమెంట్స్ వెంట పెట్టుకోవాలన్నారు. మైనర్లకు మోటార్ సైకిల్ ఇవ్వొద్దన్నారు. ఒకవేళ ఇస్తే.. వారి తల్లిదండ్రులపై 304-II ఐపీసీ కింద కేసు నమోదు చేస్తామన్నారు. నెంబరు ప్లేట్ లేని మోటార్ సైకిల్ రోడ్లపై నడపొద్దని.. నడిపిస్తే వెహికల్ సీజ్ అవుతుందన్నారు. ఆక్సిడెంట్ జరిగిన ప్రదేశంలో ఎట్టి పరిస్థితులల్లో గుమ్మిగూడొద్దన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై అడ్డగోలుగా ఆటోలు నిల్పొద్దన్నారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ డాకుమెంట్స్ వెంట పెట్టుకోవాలన్నారు. ఒక్క నెల రోజుల లోపు ఇవన్ని సమకుర్చుకోవాలని.. తర్వాత వెహికిల్ వెంట డ్రైవింగ్ లైసెన్స్, వెహికిల్‌కు సంబంధిన డాకుమెంట్స్ లేనియెడల వెహికిల్ సీజ్ చేసి చట్టపరమైన తగు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై రాష్ డ్రైవింగ్ చేయొద్దని.. బుల్లెట్ వాహనాలకు హైసౌండ్ కల్గిన సైలెన్సరులు పెట్టొదన్నారు. పెడితే వెహికిల్ సీజ్ చేస్తామన్నారు. జహీరాబాద్ పరిదిలోని ధాబాలు/హోటళ్ళు రాత్రి 11:30 గంటలలోపు మూసివేయాలని.. లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమతంగా వుండాలని, ఫోన్‌కాల్ చేసి ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితులలో చెప్పొద్దన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటి పరిష్కారానికి నేరుగా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కోహీర్

రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డప్పు దేవయ్య(35) శుక్రవారం రాత్రి 10.30 గంటలకు దిగ్వాల్ గ్రామ శివార్‌లో ప్రిన్స్ ధాబా ముందు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలపై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సబిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.



బీఆర్ఎస్ సభకు తరలిన పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-జిన్నారం

పటాన్చెరువు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన బీఆర్ఎస్ సభకు జిన్నారం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బి ఆర్ ఎస్ రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, మాధవరం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్‌తోపాటు ప్రజా ప్రతినిధులు, తాజా మాజీ సర్పం చు లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ అను బ ంధ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి.

నవతెలంగాణ
3
మెదక్
ఆదివారం | 14 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

ఫైనాన్స్‌ల పేరిట మోసగిస్తే చర్యలు : ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట

మండలంలో ఫైనాన్స్‌ల పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తూ అధిక వడ్డీ కోసం డబ్బులను అప్పుగా ఇచ్చి మోసం చేస్తున్నారని, ప్రజలను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. మండలంలో అనుమతులు లేకుండా కొందరు వడ్డీ వ్యాపారం చేస్తున్నారన్నారు. అమాయక ప్రజలను మోసగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు ఉన్నట్లయితే కేసులు చేస్తామన్నారు. వడ్డీ రూపంలో ప్రజలను మోసగించినట్లు తెలిసినట్లయితే అట్టి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డబ్బుల పేరిట మోసం జరిగినట్లయితే సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించినట్లయితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

నవ తెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శివంపేట కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా ఆధ్వర్యంలో పార్టీ క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు దావూద్, మండల వికలాంగుల సంఘం అధ్యక్షులు బాసంపల్లి స్వామి గౌడ్, కమలయ్యగారి రాములు, నాగయ్య గుప్తా, లస్కర్, పాండు చిన్న గొట్టిముక్కుల గ్రామానికి చెందిన 20 మంది, శభాష్ పల్లి గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు..

మంత్రి కొండా సురేఖ ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్

పార్లమెంట్ ఎన్నికల సన్నాక సమావేశంలో మంత్రి కొండా సురేఖ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎమ్మెల్యే సునీత రెడ్డి తీవ్రంగా ఖండించారు. నర్సాపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీతారెడ్డి మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సమయంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానన్నారు. తనకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి అవమానపరిచిన తర్వాతే తాను బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరిన సమయంలో ఎటువంటి పార్టీ పదవి కూడా లేదన్నారు. మంత్రి కొండ సురేఖ తనను విమర్శించే ముందు ఆమె ఎన్ని పార్టీలు మారారో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీ పార్టీకి వేసినట్లు అని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం తగదన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలు రహస్య ఒప్పందాలు పెట్టుకున్నాయని, అందువల్లే కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓడిపోయిన అభ్యర్థిని తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అని చెప్పుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నెల 16న చౌటకూర్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ బహిరంగ సభకు నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నహీముద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, సూరారం నరసింహులు, ఆంజనేయులు గౌడ్, కొన్యాల నరసింహా రెడ్డి, రింగుల ప్రసాద్, కొండి కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం 39 వార్షికోత్సవ సందర్భంగా శనివారం శ్రీదేవి భూదేవి శివపార్వతుల కల్యాణోత్సవం ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పూజారి గిరిశ్వర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గణపతి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాజిరెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగ్గా అశోక్ గౌడ్, సురేష్, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మల్లేశం చారి, భక్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా చేసుకోవాలి

నవతెలంగాణ-నిజాంపేట



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఘనంగా చేసుకోవాలని మండల మాల మహానాడు అధ్యక్షుడు బండారి చంద్రయ్య కోరారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిఘన నివాళులర్పించాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం దేశంలో పరిపాలన కొనసాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా 18 పట్టాలు పొందిన అపర మేధావిగా అంబేద్కర్ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సీత మహేష్ యాదవ్

నవతెలంగాణ-మనోహరాబాద్



మెదక్ పార్లమెంట్ సన్నాహక కార్యకర్తల సమావేశాన్ని తూప్రాన్‌లోని దేవి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయ వంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తూప్రాన్ మండల ఉపాధ్యక్షులు సీత మహేష్‌యాదవ్ సూచించారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుంటామని ఆయన తెలిపారు. తూప్రాన్‌లోని దేవి గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావ్, మెదక్ పార్టీ అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి, మాజీ అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు హజరవుతారని సకాలంలో ప్రతి ఒక్క కార్యకర్త విధిగా హజరుకావాలని కోరారు. ఈ సమావేశం తూప్రాన్ మండలంతో పాటు తూప్రాన్ మున్సిపల్, మనోహరాబాద్ మండలాలతో కలిపి నిర్వహించడం జరుతుందన్నారు. ఇరు మండలాల నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు



నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని శేరిపల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ 12వ వార్షికోత్సవ వేడుకలు శేరిపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గొండాస్వామి యాదవ్ మాట్లాడుతూ ఆదివారం గ్రామంలో గంగకు పోవడం, సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి గొల్ల కేతమ్మ మెడాలమ్మల కళ్యాణ మహోత్సవం, అనంతరం బోనాలు తీయడం, మంగళవారం ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం నిర్వహించి బోనాలు తీయడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు, అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ మల్లన్న దేవుని అనుగ్రహం అందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు సలేంద్రి కృష్ణ యాదవ్, రమేష్ యాదవ్, గొల్ల కృష్ణయ్య, క్యాంటీన్ మల్లేశం, బాలమల్లు, అరుణ్ యాదవ్, రామచంద్రం, ఎంచర్ల మల్లేశం, రవి యాదవ్, శివకుమార్, మధు, నవీన్ కుమార్, ప్రశాంత్, శ్రీధర్, మహేష్, వేణు, ఏ ప్రశాంత్, కిరణ్, విరాట్ శివాజీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

యువగర్జన సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-నార్సింగి

దౌల్తాబాద్‌లో జరుగుతున్న దుబ్బాక నియోజకవర్గ యువగర్జన సభకు బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బానపురం కృష్ణా రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డికి గతంలో ఎంపీ ఎన్నికలలో ఎలాగైతే 54 వేల భారీ మెజార్టీ ఇచ్చామో, ఈ సారి వెంకట రామిరెడ్డికి అంతకన్నా భారీ మెజార్టీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎండీ వాహిద్, పెద్ద తాండా అధ్యక్షుడు బాషా నాయక్, యూత్ అధ్యక్షుడు సుదీప్ గౌడ్, బొమ్మగారి సత్యం, అంబరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిజాంపేట

టీఎస్ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టు అసోసియేషన్ తూప్రాన్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణ, కార్యదర్శిగా వెంకటస్వామి గౌడ్, కోశాధికారిగా నవీన్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన భీమ్ రావ్ పల్లి రైతు మాజీ వార్డు మెంబర్ బోయిని భూషణం, రేణుక తక్కువ ఖర్చుతో కాకరకాయ సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కాకరకాయ ను 15 గుంటల స్థలంలో సాగు చేస్తూ ఇతర పంటల కన్నా ఎక్కువ లాభాలను ఆర్జిస్తున్నారు. తమకు ఉన్న వ్యవసాయ భూమిలో 3 ఎకరాలలో వరి, 15 గంటలలో కాకరకాయను సాగు చేస్తున్నామని రైతులు బోయిని భూషణం, రేణుకలు తెలిపారు. మూడు నెలల క్రిందట కాకరకాయ పంటను వేశామని, అధిక ఖర్చు కాకుండా సరైన పద్ధతిలో సాగు చేస్తున్నామని అన్నారు. సరైన సమయానికి సరైన సమయంలో పురుగుమందు, పూత మందు సరైన మోతాదులో పిచికారి చేస్తే అధిక దిగుబడి రాబట్ట వచ్చన్నారు. దాదాపు 45 రోజుల నుంచి పంట కోత చేస్తున్నామన్నారు. కాయ 13 సెంటీమీటర్ల వరకు పెరిగిందని, పంట ఏపుగా వస్తుందన్నారు. రోజూ దగ్గరలో విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. 3 ఎకరాలలో వేసిన వరి పంట కన్నా అధిక రాబడి 15 గుంటలో వేసిన కాకరకాయ పంట వల్ల వచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

నిలువ పందిరి పద్ధతిలో సాగు

పంట పండించే విధానం గురించి వివరిస్తూ సంకరజాతి కాకరకాయను పండిస్తూ, పంటను నిలువ పందిరి పద్ధతిలో సాగు చేస్తున్నారు. డ్రిప్‌తో కాకుండా నీటిని, సూక్ష్మ పోషకాలను కాలువల పద్ధతిలో అందిస్తున్నామని, దాని వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన దిగుబడి వచ్చిందని రైతులు వివరించారు. కాకరకాయకు కూరగాయలలో మంచి స్థానం ఉందని,



సంకరజాతి కాకర కావడం వల్ల డిమాండ్ బాగా ఉందన్నారు. ధర కూడా మంచిగా వచ్చి లాభాలు తెచ్చి పెడుతుందన్నారు. దగ్గరలోని చేగుంట అంగడిలో కాకరకాయను విక్రయిస్తున్నామని వారు తెలిపారు. ఎల్లప్పుడూ ఒక్కటే పంట కాకుండా పంట మార్పిడి చేయడంతో భూమి సారవంతం అవుతుందన్నారు. చిన్ని చిన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వ్యవసాయం చేసుకుంటే రైతులు మంచి దిగుబడి, లాభం పొందవచ్చన్నారు. మాజీ వార్డు మెంబర్ బోయిని భూషణం రేణుక పండిస్తున్న పంటపై చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా రంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

నవ తెలంగాణ-నర్సాపూర్

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు అన్నారు. శనివారం టీఎస్‌యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో టీఎస్ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఏప్రిల్ చివరి వారంలో గ్రామాల్లో గడపగడపకు వెళ్లి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఏకతాటిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్చా నాయక్, టిఎస్ యుటిఎఫ్ నాయకులు రవి, కనకరాజు, రమేష్ రాజు, గంగాధర్, అప్పలనాయుడు, రవి, పెంటయ్య, రాజు, కనకాచారి, సత్యనారాయణ, భాస్కర్, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన పాలసాని



నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భాజపా ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్చార్జి పాలసాని మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ నాయకత్వానికి మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, దేశం ప్రతి రంగంలో అభివృద్ధిలోకి దూసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల విజయకుమార్ గౌడ్. జిల్లా ఉపాధ్యక్షులు సత్యపాల్ రెడ్డి. పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్. దాయం నరేష్. లింగారెడ్డి. గురుపాదం. యాదగిరి. లక్ష్మణ్. శేఖర్ రెడ్డి,. సాయి. వేణు ప్రశాంత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టు వద్ద నగదు పట్టివేత



నవతెలంగాణ-మనోహరాబాద్

పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో మండలంలోని కాళ్ళకల్ చెక్‌పోస్టు వద్ద భారీగా డబ్బులు పట్టు బడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, మద్యం తరలి వెళ్లకుండా ఓటర్లను ప్రలోబాలకు గురి చేయకూడదనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జాతీయ రహదారిపై పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి కూచారం వైపు వస్తున్న స్కార్పియో కారును తనిఖీ చేయగా రంగారెడ్డి జిల్లాకు చెందిన సాగర్ సూర్య వంశీ వద్ద ఎలాంటి ఆధారాలు లేని లక్ష రూపాయలు పట్టుబడ్డాయి, అలాగే రంగారెడ్డి జిల్లా హైదర్‌షాకోట్‌కు చెందిన హరినాద్ చారీ వద్ద లక్ష రూపాయలు పట్టుబడ్డాయి. అలాగే రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన బాష్‌నట్‌జానా వద్ద రూ.65 వేలు పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకొని అధికారులకు అప్పగించారు. వారికి మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి రిసిప్ట్‌ను అందజేశారు.

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

161వ జాతీయ రహదారిపై మండల పరిధిలోని కోలపల్లి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ పోలీసులు రూ.4.50 లక్షల నగదును పట్టుకున్నారు. అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పేట ఎస్ఐ శంకర్ వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేని రూ.4.50 లక్షల నగదు పట్టుబడింది. మహారాష్ట్ర నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పులిచెర్ల వీరయ్య వాహనంలో ఎలాంటి ధృవపత్రాలు లేకుండా రూ.4.50 లక్షల నగదు తీసుకు వెళుతుండగా, ఆ నగదును స్వాధీనం చేసుకొని సంగారెడ్డి జిల్లా గ్రీవెన్స్ కమిటీ లో డిపాజిట్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరు కూడా రూ. 50 వేలకు మించి నగదును తీసుకువెళ్లరాదని అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి పేర్కొన్నారు.



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీఎస్ యుటిఎఫ్ ముందంజ

- బదిలీ అయిన ఉపాధ్యాయులను చివరి పని దినం రోజున విడుదల చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పద్మారావు

నవతెలంగాణ-మెదక్

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యుటిఎఫ్ నిరంతరం ముందుండి పోరాటం చేస్తుందని టీఎస్ యుటిఎఫ్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. పద్మారావు పేర్కొన్నారు. శనివారం టీఎస్ యుటిఎఫ్ మెదక్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ పతాకావిష్కరణ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ విద్యా ఉపాధ్యాయ సమస్యలపై టీఎస్ యుటిఎఫ్ పోరాటం చేస్తూ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య వేదిక ఏర్పాటులో కీలక పాత్ర పోషించి పీఆర్సీ సాధన కోసం ఉద్యమం చేసిందని, ఐక్య ఉద్యమాలకు నాంది పలికిందని, మెరుగైన వేతన స్కేలు కోసం ప్రయత్నించిందని గుర్తుచేశారు. పండిట్, పిఈటీల పోస్టుల అప్గ్రేడేషన్ కొరకు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. జీవో 317 అమలులో జరిగిన లోటుపాట్లను సరి చేయడానికి ప్రభుత్వం ముందుకురావడం హర్షించదగ్గ పరిణామన్నారు. బదిలీ అయినా ఉపాధ్యాయులను చివరి పని దినం రోజున విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యుటిఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కవిత, కార్యదర్శులు సుధాకర్, భీమ్లా నాయక్, యేసయ్య జిల్లా కమిటీ సభ్యులు పోచయ్య, శీతల్ సింగ్, శ్యాంసుందర్, రవీందర్, ప్రేమ్ కుమార్, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ - నార్సింగి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఐకేపీ సీసీ శంకర్, వీఓ లక్ష్మి నరసమ్మలకు పలు సూచనలు చేశారు. వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని, డేటాను వెంటనే నమోదు చేయాలన్నారు. కొనుగోలులో అన్ని జాగ్రత్తలు, సూచనలు పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రైతులతో మాట్లాడి కేంద్రంలోని ఏర్పాట్లపై వాకబు చేశారు.

మండలంలో 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్ : పెద్ద శంకరంపేట మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు తహశీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ వర్షంతో పేటలోని పలు అంతర్గత రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. ఒక్కసారిగా భారీగా వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యం

నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాకేష్ యాదవ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీనవేని రాకేష్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బీనవేని రాకేష్ యాదవ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన విధంగా బూత్ జోడో ద్వారా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల కోసం వెంటనే డోర్ టు డోర్ ప్రచారం మొదలు పెట్టాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న అబద్దపు ప్రచారాన్ని తిప్పి కొట్టి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రచారం వేగవంతం చేయాలని కోరారు. బీజేపీ చేస్తున్న విద్వేష రాజకీయాలు తిప్పి కొట్టి ప్రజలకు నిజానిజాలు తెలిసేలా కాంగ్రెస్ పార్టీ తరుపున పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాంతల శివారెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కో ఆర్డినేటర్ చిదురాల సురేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శులు బోయిని నరేష్, లావుడ్య జవహర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాదరబోయిన శ్రీకాంత్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శులు పోగుల కుమార్, బూరుగు సతీష్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నవేని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
ఆదివారం | 14 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

దూబా శ్రీశైలం బీఆర్ఎస్ ఏజెంట్ మేం మద్దతు ఇవ్వడం లేదు

బీఎస్ఆర్కెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కృష్ణ గౌడ్

నవతెలంగాణ-తొగుట



మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా బీఎస్ఆర్కెఎస్ నుండి పోటీచేస్తున్న దూబా శ్రీశైలంకు మేం మద్దతు ఇవ్వడం లేదని భావన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాలా కృష్ణ గౌడ్ అన్నారు. శనివారం తొగుట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం దూబా శ్రీశైలం అధ్యక్షులుగా నియమిస్తే కార్మిక సంఘానికి ఏమి చేశాడని ప్రశ్నించారు. ఆనాటి నుండి మాజీ మంత్రి హరీష్ రావు కాళ్ళ దగ్గరికి సంఘన్ని తీసుకెళ్లి అందరిని బానిసలు చేశారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమం పేరు చెప్పుకొని బీఆర్ఎస్ కు లాభం చేకూర్చే విదంగా డ్రామాకు తెరలేపారని మండి పడ్డారు. కార్మిక సంఘం నుంచి కార్మిక సంక్షేమం కొరకు రాష్ట్ర కమిటీ అభ్యర్థిని పెట్టాలని ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఆర్కెఎస్ నాయకులకు ఎల్లం, నర్సయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

నవ తెలంగాణ - మిరు దొడ్డి



ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి అక్కడికక్కడే చెందిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి గ్రామ శివారులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో అల్వాల గ్రామానికి చెందిన నసీరుద్దీన్ మృత్యువాత పడ్డాడు. అతివేగంగా రావడం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని వెంటనే గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పరశురాం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నజీరుద్దీన్ మృతితో అల్వాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య జాంగిర్ బి, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్ గ్రామంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయ అభివృద్ధికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకారాన్ని అందించాలని ఆలయ కమిటీ కోరింది. విరాళాలు అందించిన వారిలో జీడిపల్లి వినోద్ రెడ్డి రూ.1,00,116, సిరిసిల్ల బాలయ్య రూ.29,000, మారుతి వెంకట నరసింహ రెడ్డి రూ.20,000, సడాల కరుణాకర్ రూ.15,000, దాచారం కనకయ్య రూ.9870 రూపాయలు అందించారు. ఇంకా ఎవరైనా దాతలు ఉంటె ఆలయ అభివృద్ధికి సకరించాలని ఆలయ కమిటీ కోరింది. విరాళాలు అందించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన రథశాల నిర్మాణానికి భూమి పూజ చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి వెంకట్ నర్సింహారెడ్డి, సిరిసిల్ల బాలయ్య, సడాల కర్ణాకర్, దాచారం కనకయ్య, కొత్త దయాకర్ రెడ్డి, కొంపల్లి కరుణాకర్, దాచారం బాల్ నర్సయ్య,జీడిపల్లి మల్లారెడ్డి, రఘు పంతులు, మన్నె ప్రకాష్ ,మన్నె రవి,గాండ్ల కుమార్ ఉన్నారు.

బిగుల్ల బాబుకు అంబేద్కర్ జాతీయ పురస్కారం

-హర్షం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షులు

నవతెలంగాణ-బెజ్జంకి



దళిత సాహిత్యంలో పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ సాధించిన మండల పరిధిలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన హింది ఉపాధ్యాయులు బిగుల్ల బాబుకు డాక్టర్ అంబేడ్కర్ జాతీయ పురస్కారం వరించింది. హింది నవలల్లో దళిత చైతన్యం అనే అంశంపై పరిశోధన పూర్తి చేసిన బాబుకు ఢిల్లీలోని భారతీయ సాహిత్య అకాడమి 2023 ఏడాదికి డాక్టర్ అంబేడ్కర్ జాతీయ పురస్కారాన్ని ప్రధానం చేశారు. బాబుకు జాతీయ పురస్కారం రావడం పట్ల శనివారం బీఆర్ఎస్ యువజన మండలాధ్యక్షులు బిగుల్ల మోహన్ హర్షం వ్యక్తం చేశారు.హింది ఉపాధ్యాయుడు బిగుల్ల బాబు డాక్టర్ అంబేడ్కర్ జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని వివేకానంద యువజన సంఘం కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

ముగ్గురి యువకుల పరిస్థితి విషమం

నవతెలంగాణ-బెజ్జంకి

రాత్రి సమయంలో రాజీవ్ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని తోటపల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం ప్రమాద సంఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం జుగుండ్ల గ్రామానికి చెందిన ధర్మేందర్, సంపత్, సంపత్ ముగ్గురు యువకులు కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట నుండి కరీంనగర్ వెళ్తున్నారు.ఈ క్రమంలో ద్విచక్ర వాహనం వెనుక భాగంలో లారీ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.అంబులెన్స్ యందు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.యువకుల పరిస్థితి విషమంగా ఉందని. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి మల్లేష్ యాదవ్ బియ్యం అందజేత

నవ తెలంగాణ- దుబ్బాక



అనారోగ్యంతో మరణించిన దుబ్బాక మండల పరిధిలోని పోతారం గ్రామానికి చెందిన దండుగుల పుల్లయ్య కుటుంబానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సల్కం మల్లేష్ యాదవ్ సహకారంతో శనివారం క్వింటాల్ బియ్యం అందజేయడం జరిగిందని కాంగ్రెస్ పోతారం గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్త రమేష్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ నాయకులు కొత్త దేవి రెడ్డి,సల్కం వినీత్, రాజి రెడ్డి, ముత్యాలు, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, సంతోష్, శ్రీనివాస్, రాజిరెడ్డి, ఎండీ మసూర్ ఉన్నారు.

బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడిగా నిహాల్ గౌడ్ నియామకం

నవ తెలంగాణ- దుబ్బాక



బీజేపీ యువ మోర్చా బీజేవైఎం దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పల్లె నిహాల్ గౌడ్ ను నియమించినట్లు బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి తెలిపారు. ఈ నియామక పత్రాన్ని నిహాల్ గౌడ్ కు శనివారం దుబ్బాకలో అందజేశారు.త్వరలో జరగబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిహాల్ గౌడ్ మాట్లాడుతూ పదవి తన పై మరింత బాధ్యత పెంచిందన్నారు. రఘునందన్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు.పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లల్లో పోలీసుల సోదాలు

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని పలువురు వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లల్లో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పలువురు వడ్డీ వ్యాపారస్థులు అధిక వడ్డీలకు ఇతరులకు ఇస్తూ మనీ లాండరింగ్ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. దీంతో గత కొద్దిరోజులుగా ఈ చర్చ మండలంలో జరుగుతుంది. గుర్తించిన పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు కొందరు వడ్డీ వ్యాపారస్తుల ఇండ్లలో సోదాలు చేశారు. కాగా ఇందులో ఎవరెవరి వద్ద ఎంత డబ్బు దొరికిందనే వివరాలు పోలీసులు తెలుపలేదు.

అప్పుల బాధతో క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవ తెలంగాణ - కొండపాక



అప్పుల బాధతో క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ పి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం కుకునూర్ పల్లి మండల కేంద్రానికి చెందిన పాల పరమేశ్వర్ గౌడ్(32) బ్యాంకులోన్ తీసుకోని తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టారు. కాలం సరిగా కాక పంటలు పండకపోవడంతో గత కొద్ది రోజుల నుండి అప్పుల ఎలా తీర్చాలని మదనపడేవాడు. ఈ నేల 7న వ్యవసాయ పోలం దగ్గరికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి అస్వస్థతకు గురై వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యులు పరీక్ష చేసి గుర్తు తెలియని క్రిమీ సంహారక మందు తాగడని పరిస్థితి విషమంగా ఉందిని తెలుపగా మెరుగైన వైద్యం కోసం ములుగు మండలంలోని లక్ష్మక్క పల్లిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఆరో తరగతి, మూడో తరగతి చదువుతున్న ఆడపిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్‌వి ఉద్దెర మాటలు అడ్డగోలు హామీలు

- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కాంగ్రెస్ ఉద్దెర మాటలు..అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ విద్యార్థి యువజన చైతన్య సదస్సు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రజలను మాయచేసి మభ్యపెట్టిందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టిందన్నారు. కొట్లాడి సాధించిన తెలంగాణలో పదేళ్ల అభివృద్ధి చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మాయచేసి మభ్యపెడుతుందన్నారు. రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను గుర్తించాలని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1.61 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఐదేళ్లలో బండి సంజయ్ కరీంనగర్‌కు గుడి ...బడి తేలేదన్నారు. నేను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌లో ట్రిబుల్ ఐటీ మంజూరు చేయించి, 50 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తే ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పట్టించుకోక పోవడంతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించి ందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ ఒక్క గుడి తేలేదు.. ఒక్క నవోదయ పాఠశాల తేలేదని పేర్కొన్నారు. బండి సంజయ్‌కి యువకులు, విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కూడా కేంద్రం నుంచి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఎందుకు తేలేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల వారు వివిధ స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులు నేర్చుకుని వచ్చి 30 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఇంకా 23 నవోదయ విద్యాలయాలు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవిందర్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, రాజకీయ విశ్లేషకులు వి.ప్రకాష్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్ర శ్రీహరి,దరువు ఎల్లన్న ఏనుగుల రాకేష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, విద్యార్థి నాయకులు యువకులు పాల్గొన్నారు.





పార్లమెంటు ఎన్నికల్లో దుబ్బాక సత్తా చాటాలి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవ తెలంగాణ -దౌల్తాబాద్:

ఉద్యమాల గడ్డ దుబ్బాకలో మెదక్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డికి ఘన విజయం అందిద్దామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.. దుబ్బాక అంటే మొదటి నుండి ఉద్యమ నాయకులు కేసీఆర్, హరీశ్ రావు ల అడుగులో అడుగై ముందుకు సాగడం జరిగిందన్నారు. సిద్దిపేట జిల్లాలోనే కేసీఆర్, హరీశ్ రావు లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, మెదక్ ఉప ఎన్నికలు మనకు అత్యంత ప్రతిష్ఠాత్మకమన్నారు. ఇప్పటికే. కాంగ్రెస్ అభ్యర్థి కి ఆదరణ కరువైందని, బీజేపీ అభ్యర్థి కి ఆపార్టీ వాళ్లే ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. మాయ మాటలు చెప్పే రఘునందన్ ను రెండు సార్లు చిత్తు చిత్తుగా ఓడించడం జరిగిందన్నారు..బూటకపు హామీలు చెప్పి అధికారంలోకి వొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు..యువత కు అండగా ఉంటామన్నారు..

ప్రభాకరన్నతో కలిసి జోడెడ్లలా పనిచేస్తాం

మెదక్ ఎంపీ అభ్యర్థి పి వెంకట్రామరెడ్డి



ఎడ్లు బండి ఇస్తామని, నిరుద్యోగ భతి ఇస్తామని దోఖా చెయ్యలేదని, గెలిచిన నెల రోజుల్లో 100 కోట్ల తో ట్రస్టు ఏర్పాటు చేసి అండగా ఉంటానని మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామరెడ్డి హామీ ఇచ్చారు. దుబ్బాక గడ్డ అంటే ఉద్యమాల గడ్డ అని, ఇక్కడ నరనరాన తెలంగాణ రక్తం ఉరుకలెత్తుతుందన్నారు .. ఆశీర్వదిస్తే దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డితో కలిసి దుబ్బాక అభివృద్ధికి జోడెడ్లలా పనిచేస్తానన్నారు..సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాకను అభివద్ధి లో ధీటుగా మలుస్తామన్నారు. రెండు మార్లు ఎంపీ గా, ఒక సారి ఎమ్మెల్యే గా ప్రభాకర్ రెడ్డి కి ఘన విజయం అందించిన దుబ్బాక ఓటర్లు తనను సైతం ఆశీస్సులు అందించాలన్నారు. ఒక ఉద్యోగిగా కుటుంబానికి ఉద్యోగ అవసరం ఎలా ఉంటుందో తెలుసన్నారు..నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులకు, నిరుపేదలకు కేవలం ఒక్క రూపాయితో సేవలు అందిస్తామన్నారు .కార్యక్రమంలో టీ ఎస్ రెడ్కో చైర్మన్ వై సతీష్ రెడ్డి సీనియర్ నాయకులు మనోహర రావు, రొట్టె రాజమౌళి పంతులు, నమిలే భాస్కరా చారి, కత్తి కార్తీక, యూత్ నాయకులు సురేష్ గౌడ్, శేఖర్ గౌడ్, మహేష్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్ ఖలీల్, రాజేందర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు..



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీఎస్ యుటిఎఫ్ కృషి

టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి

నవతెలంగాణ - సిద్దిపేట

విద్యా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో టీఎస్ యుటిఎఫ్ కృషి చేస్తుందని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యుటిఎఫ్ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యుటిఎఫ్ నిరంతరం ముందుండి పోరాటం చేస్తుందని, ఎన్నో విజయాలను సాధించిందని అన్నారు. ఐక్య ఉద్యమాలకు నాంది పలికిందని, ఉద్యోగ- ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య వేదిక ఏర్పాటులో కీలక పాత్ర పోషించి పీఆర్సీ సాధన కోసం ఉద్యమం చేసిందని అన్నారు. మెరుగైన వేతన స్కేలు కోసం ప్రయత్నించిందని గుర్తు చేశారు. పండిట్-పిఈటీల పోస్టుల అప్గ్రేడేషన్ కొరకు ,ఉపాధ్యాయులకు పదోన్నతులు, పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నదని అన్నారు. జీవో 317 అమలులో జరిగిన లోటుపాట్లను సరి చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామం అని అన్నారు. బదిలీ అయినా ఉపాధ్యాయులను చివరి పని దినం రోజున విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యుటిఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా పలు డివిజన్ ప్రాంతాల్లో ఈరోజు టీఎస్ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, పూర్వపు జిల్లా అధ్యక్షులు పి.నగేష్, జిల్లా కార్యదర్శులు కె. కనకరాజు, డి. గిరిబాబు, టీ . శివలిం, జిల్లా కమిటీ సభ్యులు జి. ప్రవీణ్ కుమార్, ఎం . శివుడు, ఈ. తిరుపతి, ఎం. గణేష్ రెడ్డి, ఎస్ .యాదయ్య, జి.గోవర్ధన్, బి .రాజేందర్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ పతాకాన్ని సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు కొరెడ్ల రాజిరెడ్డి ఆవిష్కరించారు.అనంతరం యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రాంతాలు, యాజమాన్యాలు, క్యాడర్లు, కులాలు, మతాల అంతరాలను అధిగమించి రాష్ట్రంలో ఉపాధ్యాయులందరికీ ఒకే సంఘం ఉండాలనే ఆశయంతో చారిత్రక అవసరంగా ఏర్పడ్డ సంఘం టీఎస్‌యుటిఎఫ్ అని అన్నారు. హక్కులు బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు చేసి ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గం చూపిన సంఘం అని తెలిపారు.మండల అధ్యక్షులు కొరెడ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం, సామాజిక అభ్యున్నతి లక్ష్యంగా నిరంతరం ఆందోళన, పోరాటాలతో ఐక్య ఉద్యమాల నిర్మాణం నిర్వహణలో క్రియాశీలకంగా ఉండి ప్రగతి పథంలో పురోగమిస్తున్న టీఎస్ యుటిఎఫ్ లో చేరి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు మండలాల ప్రధాన కార్యదర్శులు మేర్గోజు మల్లేశం, పిల్లి రాజు, కొమురవెల్లి మండల బాధ్యులు చింతల కనకయ్య.ఎస్. చంద్రయ్య, దూల్మిట్ట మండల బాధ్యులు టి.నర్సింహులు, వివిధ మండలాల నాయకులు పి.హన్మారెడ్డి, మోహిజోద్దీన్, పుట్ట మల్లికార్జున్, జి.రజిత,కొంగరి ప్రసాద్, కాటం శ్రీనివాస్, పాక చంద్రమౌళి, విశ్రాంత ఉపాధ్యాయులు పుట్ట యాదయ్య పాల్గొన్నారు.



కాంగ్రెస్ హయాంలో ప్రజలకు కష్టాలు

నవతెలంగాణ-మర్కుక్



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల కష్టాలు పెరిగాయని బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ చంద్రబాబు, వైస్సార్ హయాంలోనూ జలదోపిడీ జరుగుతున్నా, నోరు మూసుకున్నారన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కోసం తిరుగుతున్న తెలంగాణ పోరాట యోధుడు కేసీఆర్ అని కితాబిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 24 గంటలు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పాలనలో జనరేటర్ కొనడానికి రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. రైతు బంధు రూ.15 వేలు, అన్ని పంటలకు ఇస్తాన్నన రూ.500 బోనస్ ఎటు పోయాయని ప్రశ్నించారు. కేసీఆర్ ఎప్పుడైనా చేయగలిగిందే చెప్పాడని చెప్పిందే అమలు చేసి చూపించాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకుల మీద అక్రమ కేసులు పెడుతున్నారని పోలీసులను అడ్డం పెట్టుకునే పాలన చేసే అక్రమ కేసులు పెడుతున్నరన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలనూ వేదిస్తే ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మోసపు మాటలనూ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రజల కష్టాలు మరింత పెరిగాయని వీటినే ప్రజల్లోకి విసతృతంగా తీసుకెళ్లాలన్నారు. మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

భువనగిరి ఎంపీగా బూర నర్సయ్య గౌడ్ గెలుపు తథ్యం

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా రాజలింగం గౌడ్ ఉండి కులానికి ఏం చేశారు..?

నవ తెలంగాణ-మద్దూరు



భువనగిరి ఎంపీగా బూర నర్సయ్య గౌడ్ గెలుపు తథ్యమని అది జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్ బూర నర్సయ్య గౌడ్ పై చౌకబార్ విమర్శలు చేస్తున్నారని బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కూరెళ్ళ రాజు అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాలుసాని భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్ గౌడ్‌లతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు భువనగిరి ఎంపీగా పని చేసిన బూర నర్సయ్య గౌడ్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.9000 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశారని తెలిపారు. గౌడ కులస్తుల కోసం ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ చేయించారన్నారు. తన సొంత ఖర్చులతో గౌడ కులస్తులకు ప్రమాద బీమా పాలసీలు కట్టించాడని తెలిపారు. గౌడ సంఘం కోసం ఎంతో అభివృద్ధి చేసిన బూర నర్సయ్య గౌడ్ పై మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్ విమర్శలు చేయడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమా సురేషన్ రెడ్డి, చేర్యాల పట్టణ అధ్యక్షులు మన్నె సత్య వర్ధన్, మహిళ మండల మోర్చా అధ్యక్షురాలు కొండ నాగలక్ష్మి, సీనియర్ నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, పాల్గొన్నారు

జీరో ఫైనాన్స్ వ్యాపారిపై కేసు నమోదు పలు పత్రాలు స్వాధీనం

నవ తెలంగాణ- దుబ్బాక



ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా జీరో ఫైనాన్స్ నిర్వహిస్తున్న ఓ వ్యాపారి పై దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి అతని వద్ద నుండి నగదు, పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.సర్కిల్ ఇన్ స్పెక్టర్ పాలెపు శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ ఆదేశాల మేరకు శనివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పలు జీరో ఫైనాన్స్ లపై సీఐ పీ.శ్రీనివాస్ నేతృత్వంలో దాడులు చేశారు.నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ కేంద్రానికి చెందిన పల్లె కృష్ణ గౌడ్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని వద్ద నుంచి రూ.80,420 నగదు,పలువురి సంతకాలతో కూడిన 50 ప్రామిసరీ నోట్లు, 100 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 12 డైరీలు, 4 రికార్డులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఫైనాన్స్ వ్యాపారి పై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డీ వ్యాపార నిర్వాహకులు మనీ లాండరింగ్ ప్రకారం ప్రభుత్వ అనుమతి, తహసీల్దార్ కార్యాలయం నుండి రిజిస్ట్రేషన్, లైసెన్సు,ఇతర ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట భూంపల్లి ఎస్ఐ రవి కాంత్,దుబ్బాక ఏఎస్ఐ వాహిద్ భాష,హెడ్ కానిస్టేబుల్ హరిసింగ్,పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగుల సస్పెండ్‌కు కారణమైన హరీశ్‌రావు వెంటనే రాజీనామా చేయాలి

డీసీసీ ప్రదన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేటలో మొన్న ఉద్యోగులతో ఎన్నికల కోడు ఉల్లంగించి సమావేశం పెట్టడంతో 106 మంది ఉద్యోగులను ఎన్నికల కమిషన్ సస్పెండ్‌కు కారణం అయిన ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం హరీశ్ రావు ఉద్యోగుల జీవితాలు ఫణంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్‌రావు కొంత మంది అధికారులతో కలిసి అమాయకులైన చిరు ఉద్యోగులను బెదిరించి ప్రలోభ పెట్టి బలవంతంగా సమావేశానికి పిలిపించి సస్పెండ్‌కు కారణమయ్యారన్నారు. గతంలో కూడా మెజారిటీ ఓట్ల కోసం కొంత మంది అధికారులతో ఎన్నికల రోజు దొంగ ఓట్లు వేయించుకున్నాడన్నారు. లక్ష ఓట్ల మెజారిటీ ఓ బోగస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్, ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, నాయకులు ఏనుమట్ల శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి రాజు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం | 14 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

డా॥ బి.ఆర్. అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవ శుభాకాంక్షలు